# మోసం ఎన్నటికీ జయించదు

**(మిత్రభేదం లోని కథకి నాటక రూపం)**

## <u>పాత్రలు</u>

| | |
|---|---|
| చపలజిత్తు | జిత్తులమారి నక్క |
| ధమనకుడు | ముసలి నక్క |
| నందకుడు | పిల్ల నక్క |
| సంజీవకుడు | మరో నక్క |
| క్రూరకర్తుడు | సింహం |
| | పేర్లు లేని కొన్ని జంతువులు, పక్షులు |
| | కుందేలు |
| | పులిరాజు |
| | ఖడ్గమృగం |
| | పావురం |
| | నెమలి |
| | కోకిల |
| | ఏనుగు |
| భైరవుడు | ఊరి మడేలు |
| మంథర | మడేలు పెళ్ళాం |
| | కుక్క (నేపథ్యంలో) |

# మొదటి రంగం

(ఆనందపురం అనే వూరిని ఆనుకుని వున్న అడవిలో – ఉదయం 10 గం॥ అయింది. ముసలినక్క ఆకలితో మూలుగుతూ వుంటుంది. పిల్ల నక్క దానిని సముదాయిస్తూ వుంటుంది.)

**ముసలి నక్క**

అబ్బా!......నొప్పి....కడుపులో మంట.......ఒరే నాయనా! నందకా!.......ఆకలిరా!

**పిల్ల నక్క**

నాన్నా! ఇప్పుడే అడవంతా తిరిగొచ్చాను. ఎక్కడన్నా కోళ్ళుగాని, జింక పిల్లలు గాని దొరుకుతాయేమోనని కాళ్ళు గుదులు కట్టేట్టు తిరిగొచ్చాను..........

**ముసలి నక్క**

పోనీ, ఆ చపలజిత్తు ఆనందపురం ఊళ్ళోకి వెడుతోందేమో – దానితోపాటు పోయి ఒక కోడిపిల్లనన్నా పట్టుకురా – అబ్బా....ఆ......

**పిల్ల నక్క**

నేను పోను నాన్నా! మొన్న అట్లాగే వెళ్ళానా?.....నేను పట్టుకున్న కోడి పెట్టను లాక్కుని, నాతో వస్తేనే గదా నీకిది దొరికింది – లేకపోతే నీ కంత దమ్ములెక్కడివి – అంది..... సగం కూడా ఇవ్వలా!

**ముసలి నక్క**

అదంతేలే! ఒట్టి జిత్తులమారి –

(చపలజిత్తు తల ఎగరేసుకుంటూ వస్తుంది)

**చపలజిత్తు**

ఎవర్ని మామా, జిత్తులమారి అంటున్నావ్! నన్ను కాదు గదా!

**ముసలి నక్క**

రామ రామ! ఆ గండుపిల్లి ముండ లేదూ – అది! నేను దాచుకున్న పావురాయిని అది కాస్తా ఎత్తుకుపోయింది.

**చపలజిత్తు**

అట్లాగా పాపం!.....ఇవ్వాళ నీ కొడుకేమీ తెచ్చినట్టు లేదు!

**ముసలి నక్క**

లేదు అల్లుడూ! ఇప్పుడే తిరిగి తిరిగొచ్చాడు. అంతా తెలివిమీరి పోయారు!

**చపలజిత్తు**

నేను ఆనందపురం వెడుతున్నా!.....నిన్న వెళ్ళి మాంచి కోడిపెట్టని, ఆ బోయవాడు దాచుకున్న లేడిమాంసం ఎత్తుకొచ్చి ఎంచక్కా తినేశానా, ఇవ్వాళ చూడాలి ఎవరు దొరుకుతారో?

(కూనిరాగం తీసుకుంటూ బయలు దేరుతుంది)

**ముసలి నక్క**

అల్లుడూ!

**చపలజిత్తు**

ఏమిటి మామా?....చెప్పు.....ఫరవాలేదు!......నీక్కూడా ఏదన్నా జంతువు మాంసం తేనా?

**ముసలి నక్క**

నువ్వెంత మంచి వాడివి అల్లుడూ! నీకెప్పుడూ పెద్ద వాళ్ళంటే గౌరవమే!

**చపలజిత్తు**

అట్లాగే చూద్దాం......

**ముసలి నక్క**

మొన్నటి వరకు అక్కడే తినేసి – నాకే దొరకలేదని చెప్పావుగా!

**చపలజిత్తు**

ఛ! ఛ! ఈసారి తప్పకుండా తెస్తాగా!

(ఈల వేసుకుంటూ వెడుతూ వుండగా ఎదురుగా సింహం గర్జింపు)

అమ్మో! సింహం మహారాజు ఇటే వస్తున్నారు!.... పరగడుపున బయలుదేరాడేమో, మనం కనిపిస్తే గుటకాయి స్వాహానే! ఇక్కడ దాక్కుందాం –

(సింహం గర్జిస్తూ పరుగుపరుగున వెళ్లిపోతుంది)

**ముసలి నక్క**

చూశావా ఈ సింహం దర్ప!.... అడవికి రాజంటే అట్లా వుండాలి!....

**చపలజిత్తు**

ఆ! అవకాశం వస్తే నేను కూడా అంతకంటే గొప్పగానే వుంటాను!...... సింహానికి శరీరబలం వుంటే మనకి బుద్ధిబలం వుంది.... చిన్నవాళ్ళు కూడా తెలివితేటలతో గొప్ప వాళ్ళు కావచ్చునని మొన్న హంస మాస్టారు చెప్పలా! చూద్దాం – అవకాశం రాకపోతుందా?

(దర్పంగా, "నేనే రాజునుగా" అని పాడుకుంటూ, సింహం వెళ్ళినట్లు వెడుతుంది)

**ముసలి నక్క**

చూశావురా, వీడి పొగరు!...... సింహానిది ఒంటి బలంట! వీడిది బుద్ధిబలంట!...... సింహానికి బదులు తాను రాజు అవుతాట్ట!..... తెలివితేటలున్నా వినయంగా వుంటేనే అవి రాణింపుకు వస్తాయి.......

C C C C C

# రెండవ రంగం

(ఆనందపురంలో ఒక మడేలు ఇల్లు. ఒక పక్క ఒక కుక్క పడుకుని వుంది. మరో పక్క గాడిద. మడేలు ఇంటికి రంగులు వేస్తూ వుంటాడు..... పెళ్ళాం తొట్లలో నీళ్ళు నింపుతూ వుంటుంది. ఓ బుట్ట కింద కోళ్ళు వుంటాయి.)

**మడేలు**

ఈ సారి జూస్కో మంధరా! మన యిల్లెట్లా కలకల్లాడి పోతుందో! ఈ సంకురేత్రికి వైభోగమేననుకో!.....

**పెళ్ళాం**

గొప్పలు సెప్పుకోకు....మా తమ్ముడింటికి రంగులేశారుగా! చూశాం గదా!.... పైనంతా ఎరుపేశారు.... మధ్యలో చలవ తెలుపు.... కిందేమో ముగ్గులేసుకోడానికి నీరు కావి రంగు... అబ్బ! భలే ముద్దొస్తోంది గదూ!

**మడేలు**

నీకు నీ తమ్ముడేం జేసినా ముద్దొస్తుంది. ఆడబుద్ధి పోనిచ్చుకున్నావ్ గాదు. మన యింటి రంగులకేమే? ఏం తక్కువంటా? ఈ బంగారు రంగు! దాని పైకి యీ నీలం.... ఈ బంగారం ఎట్టా మెరుస్తదో చూసుకో –

**పెళ్ళాం**

ఆ! చూస్తున్నాంగా! ఎవడన్నా నీలానికి బంగారు అంచేస్తారంటయ్యా! నీకు తోచదు... ఎవరాన్న చెబితే ఇనవు!

**మడేలు**

ఆ మాటే అనొద్దనేది!.... నీ తమ్ముడు చేసిందేమో బెమ్మాండం – మొగుడు చేసిందేమో ఎదవది! అంతేనా?

**పెళ్ళాం**

ఆ మాటెవరన్నారు? నీకు మంచి సెప్పినా సెబ్బరే!

**మడేలు**

ఏందే మంచి? ఈ రంగులు బాగాలేవన్నావ్! యిహ రంగులేస్తే మళ్లీ సంకురేత్రిదాకా వూరికే గునుస్తూ వుంటావు – ఈటిని పారబోస్తా. నీక్కావలసిన రంగులే తెచ్చుకో –

(ఒక రంగుని మరో రంగులో కలుపుతాడు)

**పెళ్ళాం**

(పరిగెత్తుకుంటూ వచ్చి) ఏందయ్యా ఆ పని!..... బుద్ధీ గానం వుండక్కర్లే? అవతలోళ్లది బాగుందంటే అంత అక్కసెందుకు? అమ్మయ్యో! ఇంత రంగూ బూడిద పాలు చేశావే? (కుక్క అరుస్తుంది)

(కుక్కతో) ఏయ్! నువ్వూరుకో! నేను ఈనతోనే చచ్చిపోతావుంటే –

**మడేలు**

ఏందే? (పైపైకి వస్తూ) ఏందేనువ్వనేమాట? ఆ కుక్క నేను ఒకటేనంటే నీకు?..... నోరు మరీ లేస్తుంది – అణుస్తాజూడు......

**పెళ్ళాం**

ఏందయ్యో వూరికే బోయ్ బోయ్ లాడతావ్! ఎందుకు అరుస్తావని దాన్నంటే నీకెందుకు కోపం?

(కుక్క మళ్ళీ అరుస్తుంది)

**మదేలు**

మళ్ళీ అదే మాట. ఇవ్వాళ నాచేతి రుచి చూస్తావ్ నువ్వు!

**పెళ్ళాం**

ఆ! ఆ!..... నీతో మాట్టాడ్డం నాదే తప్పు – ఇదుగో లెంపలేసుకుంటున్నా – ఇహ మాట్టాడితే ఒట్టు – (కుక్క అరుస్తోంది. దాన్ని అదిలిస్తూ) ఏయ్! నోరుమూసుకోవే – (మొగుడితో) నిన్ను గాదులే అయ్యా! మళ్ళీ కొడతా, చంపుతానంటావు!

(ఇంతలో చపలజిత్తు మెల్లగా వచ్చి కోళ్ళు వున్న బుట్ట దగ్గరకు వెడుతూ దాని చుట్టూ తారట్లాడుతుంది. కుక్క అరుపు)

**మదేలు**

(నక్కను చూడడు.....కుక్కని అదిలించడానికి వెడుతూ) ఒట్టి పున్నానికి అరుస్తావెందుకు? (పెళ్ళాంతో) నిన్ను గాదులే అమ్మా! ఈ రంగు నీళ్ళ కోసం గాదే నీతో ఇంతింత మాటలు పడుతోంది – (కుక్కతో) ఏందే అట్లా ఒరలుతున్నావ్? (అని ఆ రంగు నీళ్ళు తీసుకుని వెడుతూ వుంటాడు)

**పెళ్ళాం**

ఏం చేస్తున్నావయ్యా ఆ రంగుని?

**మదేలు**

ఏం చేస్తున్నానా?.... కాలవలో పారబోస్తున్నా –

**పెళ్ళాం**

అయ్యో! అదేం పనయ్యా –

**మదేలు**

నీకంటికి ఆ రంగులు ఆనకబోయాక యింకెందుకే!

**పెళ్ళాం**

(నక్క కోడిపుంజుల దగ్గర తచ్చాడ్డం చూసి) అయ్యో! అయ్యో!.... ఈ నక్క ముండ – (బిగ్గరగా ఏడుస్తూ) నేనేం జేతునే! (దగ్గరలో వున్న కర్రను దానిమీదికి విసిరేస్తూ) ఫో! ఫో!

**మదేలు**

నువ్వొకదానివే మాకు తోడు! ఈ అడివి దగ్గర వుండడం కాదుగాని ఈ నక్కల్నుంచి కోళ్ళను కాపాడుకోడం చచ్చిన చావవుతోంది..... ఓసి నీ యవ్వ –

(అని బక్కెట్లో వున్న రంగు నీళ్ళని దాని మీదకు కుమ్మరిస్తాడు. చపలజిత్తు కుయ్యో, మొర్రో అని వూళవేస్తూ పరిగెత్తుతుంది. మదేలు, పెళ్ళాం దానిని వెంట తరుముతూ వుంటారు)

C C C C C

## మూడవ రంగం

(అడవి..... చపలజిత్తు ఒళ్ళు విదిలించుకుంటూ వచ్చి ఓ చెట్టు కింద నిలబడ్డది)

**చపలజిత్తు**

ఒళ్ళంతా ఏమిటిది? బురదనీళ్ళు! ఇప్పుడు పోయి ఏ కాలవలోనన్నా మునగాలా ఏమిటి? అసలే ఆకలికి నకనక లాడిపోతున్నాను! ఒక్క పిట్ట దొరకలేదివ్వాళ!...... నా రోజులు బాగుండి ఆ మడేలు పెళ్ళాం విసిరిన కర్ర దెబ్బ తప్పించుకున్నా.... లేకపోతే ఆ ముసలి నక్కలా మూలుగుతూ కూర్చోవాల్సొచ్చేది?

(కుందేలు అటు వెడుతూ, దగ్గరకు వచ్చి చపలజిత్తును చూసి, భయపడి పరుగెత్తుకు పోతుంది)

అయ్యో! కుందేలు తమ్ముడూ! నేను! చపలజిత్తును!..... (కుందేలు వెళ్ళిపోయింది). నన్ను గుర్తు పడితే వచ్చి పలకరించేదేనే!..... 'అమ్మో!' అనుకుంటూ పరిగెత్తిందంటే నన్ను చూసి భయపడ్డదా యేం? (నవ్వి) ఈ రంగు చూస్తే భలే తమాషాగా వుందే! ఈ నీలం రంగు! మధ్యలో బంగారం బిళ్ళలంటించినట్టు మచ్చలు!.... ఇట్లాగే అడవిలోకి వెడితే! వాళ్ళంతా నన్నొక కొత్త జంతువొచ్చిందని పట్టుకుని చంపరు గదా!

(ఇంతలో మరో నక్క సంజీవకుడు అటు వెడుతూ, చపలజిత్తును చూసి, మళ్ళీ దగ్గరగా వచ్చి చూస్తుంది... చపలజిత్తు తెచ్చిపెట్టుకున్న గొంతుతో)

**చపలజిత్తు**

ఎవరది? (అంటూ లేచి ముందుకు రాబోతాడు)

**సంజీవకుడు**

అమ్మో!.... ఇదేదో కొత్త జంతువు. ఎక్కడా చూళ్ళేదు యిటువంటి దాన్ని! అమ్మో! నన్ను చంపుకు తినదు కదా! (అని పరుగెడుతూ వుంటుంది)

**చపలజిత్తు**

ఏయ్! సంజీవకా! నేను!... గుర్తు పట్టలా?

**సంజీవకుడు**

(ఆగి భయపడుతూ) ఎవరది? గుర్తు పట్టలేదే! క్షమించండి మహారాజా!.... నన్నేం చెయ్యకండి.... మీకు ఏ సాయం కావాలన్నా చేస్తాను.

**చపలజిత్తు**

(గంభీరంగా) భయంలేదు సంజీవకా! నీ ప్రాణమునకు ఈ అడవిరాజు అభయమిచ్చుచున్నాడు.... (అని మళ్ళీ పకపకా నవ్వుతాడు)

**సంజీవకుడు**

అయ్యా!... మీరు....మీరు..... నువ్వు చపలజిత్తువి కాదూ?

**చపలజిత్తు**

(నవ్వి) ఆ!! నేనే!

**సంజీవకుడు**

మరి ఈ మచ్చలేమిటి? ఈ రంగేమిటి?.... ఏదో కొత్త జంతువులా, భయం వేస్తూ వున్నావు.... ఏ దేవుడన్నా ప్రత్యక్షమై నిన్నిట్లా మార్చలేదు గదా! అచ్చంగా మన గురువుగారు చెప్పిన వన దేవతలా వున్నావు... (అప్పుడు కుందేలు వచ్చి చాటున పొంచి వుంటుంది)

**చపలజిత్తు**

(తనలో) వీడు చెప్పింది బ్రహ్మాండంగా వుంది... దేవుడే...... కాదు, కాదు.... దేవతే, ఈ వన దేవతే ప్రత్యక్షమై ఇట్లా వరం ఇచ్చిందని చెబుతా –

(సంజీవకుడితో) ఓయీ సంజీవకా! నిజము పలికితివి! ఇది ఈ వనదేవత యిచ్చిన వరమే!

**సంజీవకుడు**

(దగ్గరకొచ్చి, పరికించి చూస్తూ) వరమే! ఎంత అదృష్టవంతుడివి! నువ్వు ఎప్పుడూ యింతే! ఎంతో ధైర్యస్థుడివి!

**చపలజిత్తు**

(గంభీరంగా) ధైర్యేసాహసే రాజ్య – అన్నారు కదా!

**సంజీవకుడు**

చిత్తం –

**చపలజిత్తు**

ఆ అమ్మవారే నాకీ వరం యిచ్చి – యీ రంగునీ, మహిమ కల యీ బంగారు మచ్చలనీ యిచ్చి – నిన్నెవరన్నా అడ్డుకుంటే యీ మచ్చలను పట్టుకుని మంత్రం చదివి వాళ్ళ మీదికి ప్రయోగించు. వాళ్ళు మాడి మసై పోతారు – అంది –

**సంజీవకుడు**

అమ్మో! ఇదంతా నిజమే?

**చపలజిత్తు**

ఏమీ! (మచ్చ మీద చెయ్యిపెట్టి "ఓం వనదేవతాయనమః" అంటూ కళ్లు మూసుకుంటాడు) భస్మము చేయమందువా?

**సంజీవకుడు**

(దగ్గరక వచ్చి వినయంగా) చపలజిత్తూ!.... కాదు కాదు... చపలజిత్తు మహారాజు గారూ!

**చపలజిత్తు**

ఆ... ఆ..... (అంటూ తల వూపుతూ నవ్వుతాడు)

**సంజీవకుడు**

మరి అడవిలోకి వస్తే మనకంటే గొప్ప జంతువులు, క్రూర జంతువులు వున్నాయి గదా! అవి వూరుకుంటాయా? మిమ్మల్ని చంపి –

**చపలజిత్తు**

(కోపంగా) ఆ! ఏమంటివేమంటివి? (మళ్ళీ మచ్చమీద చెయ్యిపెట్టి "ఓం వనదేవతాయనమః" అంటాడు)

**సంజీవకుడు**

కాదు మహారాజా! ఒకవేళ అట్లా చేస్తారేమోనని నాకు భయంవేసి –

**చపలజిత్తు**

చేస్తే వాళ్ళని మట్టి కరిపిస్తాను. అందరినీ చంపుతాను.... (కుందేలు భయపడుతూ పరుగెత్తుకు వెళ్ళిపోతుంది) కాని..... (ఆలోచించి) అందరినీ చంపుకుంటూ పోతే మనకిహ అడవిలో మిగిలేదెవరు?.... (అటూ యిటూ పచార్లు చేసి ఆగి) ఆ! సంజీవకా! వాళ్ళందరినీ నమ్మించడమే కదా మనం చేయవలసిన పని!..... మన యిద్దరం కలిస్తే వాళ్ళను నమ్మించడం ఎంతసేపు?...

**సంజీవకుడు**

ఎందుకు నమ్మించడం?

**చపలజిత్తు**

పిచ్చివాడా! మన నక్క జాతివాడు ఎప్పటికయినా యీ అడవి రాజ్యానికి రాజు కాగలడా? ఇప్పుడు అమ్మవారు యిచ్చిన యీ వరంతో మన జాతి వాడు రాజు కావచ్చు.... నువ్వు..... నువ్వు నాకు ఆంతరంగిక కార్యదర్శి వవుతావు..... అప్పుడు నిన్ను కాదన్న వాళ్ళందరినీ నువ్వు ఎట్లా కావాలంటే అట్లా శిక్షించొచ్చు – ఈ అడవి జంతువులకి దొరికిన ఏ మాంసం అయినా మనకు పెట్టిగాని అవి తినకూడదు – ఇప్పుడు మనం సింహం రాజుగారికి సమర్పించుకోవడంలా? ఇహ రేపట్నుంచి ఆ నైవేద్యం మనకి!

**సంజీవకుడు**

నిజంగానా?

**చపలజిత్తు**

ఆ!

**సంజీవకుడు**

అయితే యేం చెయ్యాలో చెప్పు –

**చపలజిత్తు**

ఏముంది? నువ్విక్కడ చచ్చినట్టు పడుకుని వుండిపో –

**సంజీవకుడు**

చచ్చినట్టా? ఎందుకు?

**చపలజిత్తు**

చెబుతా? నేను అడవిలోకి వెడతా. అందరూ చుట్టూ చేరతారు. బెదిరిస్తారు... అప్పుడు నేను అడవి చివర మాకు అత్యంత స్నేహితుడైన సంజీవకుడు చనిపోయి పడివున్నాడు.. అతన్ని యిక్కడకు తీసుకురండి – నా మహిమను చూపుతాను – అంటాను.

**సంజీవకుడు**

మహిమ ఏమిటి?

**చపలజిత్తు**

నిన్ను బతికిస్తాను!

**సంజీవకుడు**

నేను చచ్చిపోలేదుగా?

**చపలజిత్తు**

చచ్చిపోలా! కాని వాళ్ళు నమ్మాలిగా! (కాసేపు ఆగి) వాళ్ళని నా రంగు మచ్చలతో చంపలేక కాదు – కాని రక్తపాతం అంటే నాకిష్టం లేదన్న విషయం నీకు తెలుసు కదా!

**సంజీవకుడు**

అవునవును........ (తలపటాయిస్తాడు) అయినా –

**చపలజిత్తు**

నీకిష్టం లేకపోతే చెప్పు.... వాళ్ళ మీద ప్రయోగించే మచ్చని నీ మీదనే ప్రయోగిస్తాను... అట్లా చేశాననుకో – వాళ్ళకి నా మహిమ తేలిగ్గా తెలిసొస్తుంది.. ఏమంటావ్? (కళ్ళు మూసుకుని “ఓం వనదేవాతా.....” అంటూ వుండగా)

**సంజీవకుడు**

వద్దు వద్దు..... నువ్వు చెప్పినట్టుగా చచ్చపడివుంటాను....

**చపలజిత్తు**

ఆ! ఇప్పుడు నా వాడివనిపించుకున్నావు! ఇహ చూసుకో మన తడాఖా – ఇహ వెడతా –

(ఎవ్వరాపగలరూ – నన్నిక ఎవ్వరడ్డగలరూ? నా పదవిని ఎవ్వరడ్డగలరూ)

**సంజీవకుడు**

చపలజిత్తూ!.... అహ.... మహారాజా! ఆంతరంగిక కార్యదర్శి సంగతి –

**చపలజిత్తు**

అది నీదేనన్నానుగా!! నిర్భయముగా చనిపొమ్ము సంజీవకా!.... (ఎవ్వరాపగలరూ – నన్నిక ఎవ్వరడ్డ గలరూ? అంటూ వెడతాడు)

C C C C C

## నాలుగవ రంగం

(జింక, కుందేలు, ఖడ్గమృగం, గాడిద.... వంటి జంతువులు అడవిలో చెట్లచాటున దాక్కుని నక్కుతూ నక్కుతూ చపలజిత్తు వస్తున్న వంక చూస్తూ వుంటాయి.... వాళ్ళ వెనక ముసలినక్క, కూడా వుంది)

**కుందేలు**

అదుగో! వస్తున్నాడు! నేను స్వయంగా విన్నానుగా! వనదేవత దూతగా వస్తున్నాడు...

**జింక**

అయినా అడుగుదాం – అసలు జరిగిందేమిటో?

**ముసలి నక్క**

ఏం అడుగుతావ్? అమ్మో! అసలే జిత్తులమారి! ఇహ ఏదో ఒకటి కల్పించి చెప్పక పోతాడా?

**కుందేలు**

నీదంతా ఎప్పుడూ ఎద్దేమంటే తెద్దేమేకదా!... మాకెందుకొచ్చింది? పాతరాజు గారూ, కొత్తరాజుగారూ తేల్చుకుంటారు – నేవెళ్ళి పెద్దాయనతో చెప్పొస్తా –

(జంతువులన్నీ ముందుకు వస్తాయి.... చపలజిత్తు మహారాజులాగా నడిచి వస్తుంది)

**ముసలి నక్క**

ఎవరది? చపలజిత్తా?... ఏమిటీ కొత్త వేషం?

**చపలజిత్తు**

మామా? మా వంశంలో పెద్దవాడివని క్షమిస్తున్నా! లేకపోతే వనదేవత వరంతో వచ్చినవాడిని – నిన్ను మసి చేసిపారేసేవాడిని!!

**ఖడ్గమృగం**

నువ్వంతటివాడివేలే చపలజిత్తూ! ఆయన మాటలకేమిటి? అసలేం జరిగిందో చెప్పు –

**మిగిలిన జంతువులు**

అవునవును. ఏం జరిగిందో చెప్పు.....

**నెమలి**

ఆ మచ్చలేమిటి? మాకే అనుకున్నాం...... నీకు కూడా భలే అందంగా వున్నాయే!

**కోకిల**

ఆ నీలం రంగేమిటి? మా రంగు కంటే బావుందే!

**మిగిలిన జంతువులు**

ఏం జరిగిందో చెప్పు.... చెప్పు....

**చపలజిత్తు**

మీకందిరికి చెప్పమనే వనదేవత ఆజ్ఞ!

**ఖడ్గమృగం**

వనదేవతా! అమ్మో!

**నెమలి**

అమ్మవారే!

**కోకిల**

నీకు కనిపించిందా?

**చపలజిత్తు**

కనిపించడమే కాదు... కరుణించి వరాలిచ్చి పంపింది! ఆవిడ యిచ్చిందే యీ రంగు... ఆ బంగారం రంగులో వున్నవి ఆయుధాలు!

**నెమలి**

అమ్మో! అదేమిటి? ఆయుధాలా?

**చపలజిత్తు**

అవును.... ఆయుధాలే! ఎవరినయినా చంపగలవు. ఎవరినయినా రక్షించగలవు –

(ఇంతలో వెనక సింహం గర్జింపు, పులిగాండ్రింపు. జంతువులన్నీ భయపడ్డాయి)

**ఖడ్గమృగం**

అమ్మో! మహారాజు....

**చపలజిత్తు**

(కోపంగా) ఏయ్! నేను మహారాజును....

**సింహం**

(ప్రవేశిస్తూ, గర్జిస్తూ) ఓరీ చపలజిత్తూ! నీ సంగతి యీ కుందేలు చెప్పింది. ఏమిటీ! నువ్వు యీ అడవికి రాజువా! గట్టిగా గాలి వదిలితే ఆమడదూరంలో పడతావ్! గర్జిస్తే అక్కడికక్కడే కూలిపోతావ్! నువ్వా! నాకు ఎదురు నిలిచేది?

**పులిరాజు**

(నెమ్మదిగా) నెమ్మది మహారాజా, నెమ్మది!.... అంత తొందర పనికిరాదు. తమకు ఇంతవరకు కనిపించని వనదేవత ఈ చపలజిత్తుకు కనిపించిందంటే, ఈ రంగుని, మచ్చలనీ యిచ్చిందంటే – మనం తొందర పడకూడదని అర్థం – ఏ పుట్టలో ఏం పాముందో?

**సింహం**

(పులితో) అంతేనంటావా? సరే! (బిగ్గరగా) చపలజిత్తూ!... ఏం జరిగిందో మాకు వివరించు –

**చపలజిత్తు**

(నవ్వి) మీరు కిందటి క్షణం వరకు మహారాజులే! కాని వనదేవత వరంతో వచ్చాను. ఆవిడకు దూతగా ఆవిడ తిరిగి వచ్చేవరకు నన్ను పరిపాలించమని శాసించింది. వనదేవత ఆజ్ఞకు తిరుగుందా?

**సింహం**

ఆ! ఎంత కండకావరమూ?

**పులిరాజు**

మీరుండండి మహారాజా! (చపలజిత్తుతో) చపలజిత్తూ..... ఆ... అదే... చపలజిత్తు గారూ! అసలేం జరిగిందో మాకందరికి చెప్పండి –

**జంతువులు**

చెప్పండి... చెప్పండి....

**చపలజిత్తు**

నేను ఇవాళ నాకేమీ ఆహారం దొరక్కపోతే, వనదేవత గుట్టకు వెళ్ళి అక్కడ అమ్మవారిని ధ్యానిస్తూ కరుణించు తల్లీ అని ప్రార్థిస్తూ కూర్చున్నాను.... ఎంత సమయమైందో నాకు తెలియదు. మిట్టమధ్యాహ్నం... నా ముందు పెద్ద వెలుగు..... కళ్లు నులుముకుని చూశాను..... వనదేవత! నీలం రంగు శరీరం.... మధ్య గుండ్రంగా బంగారు తాపడాలు! నా ముందు సాక్షాత్కరించింది! ఆవిడ పాదాల మీద పడ్డాను. అమ్మా! రక్షించు – అన్నాను... ఆవిడ నన్న లేవనెత్తి – "నాయనా! చపలజిత్తూ! నువ్వు నాకు నచ్చావు! ఏ జంతువును చంపితిందామా అని ఎప్పుడూ ఎదురుచూసే ఈ అడవిలో నువ్వు ఒక్కడివే భక్తితో నన్ను కొలిచావు... అందుకే నీముందు ప్రత్యక్షం అయినాను.... అంది.

**జంతువులు**

(ఒక్కొక్కటీ ఒక్కొక్క సంభాషణ చెబుతూ) అమ్మో! అమ్మనే చూశావా? ఎంత అదృష్టం! అందుకే ఆ తళతళలాడే రంగు! ఆ బంగారు మచ్చలు! అబ్బ! ఎంత బావున్నాయో!! మనం వనదేవతని ఎప్పుడన్నా ప్రార్థించామా? ప్రార్థించాడు కనకే చపలజిత్తుకు ఈ అదృష్టం –

**చపలజిత్తు**

నేను కొన్నాళ్ళు పక్క అడవిలో వున్న మా పుట్టింటికి వెడుతున్నాను.... అంతవరకు యీ అడవిని పరిపాలించు. నువ్వు నా దూతవి – అంది. అమ్మా! ఇట్లా – నక్క ఆకారంలో వుంటే ఆ అడవి జంతువులు నన్ను నమ్ముతాయా – అన్నాను. అప్పుడు వనదేవత – కళ్ళు మూసుకుని – ఎవరినో ధ్యానించి – ఒక్కసారి "ఆం ఫట్!' అంది... నా ఒళ్ళంతా నీలంగా మారిపోయింది. (జంతువులన్నీ ఆశ్చర్యంగా ఒకదానినొకటి చూసుకున్నాయి)..... మళ్ళీ కళ్ళు మూసుకుని "ఆం ఫట్! ఫట్!" అన్నది... ఈసారి ఆ నీలంరంగు మీద ఈ బంగారు మచ్చలు!! భక్తా! నా రంగునీ, బంగారు తాపడాల్ని నీకు యిస్తున్నాను. ఈ ఒక్కొక్క మచ్చ ఒక్కొక్క ఆయుధం! నువ్వు ఏం జరగాలని అనుకుంటావో దానిని మనసులో తలుచుకుంటూ 'ఓం వనదేవతాయనమ:' అని మూడుసార్లు భక్తితో మమ్మల్ని ప్రార్థించు. నువ్వు ఏం కావాలనుకుంటే అది సిద్ధిస్తుంది. ఏ శత్రువూ నిన్ను అడ్డుకోలేదు.... వెళ్ళు.... వెళ్ళి ఈ అడవి రాజ్యాన్ని నేను వచ్చేటంతవరకు జాగ్రత్తగా పాలించు – అని వెళ్ళిపోయింది –

(కొన్ని జంతువులు చపలజిత్తు మహారాజుగారికి జై – అంటాయి.)

**సింహం**

అమ్మవారు కనిపించిందని ఏమిటి గుర్తు? ఈ మచ్చలకి మహిమ వుందని ఏమిటి గుర్తు?

**చపలజిత్తు**

(నవ్వి) పిచ్చి సింహంగారూ! మీమీద ప్రయోగించమంటారా? మహిమ సంగతి తెలుస్తుంది. (కళ్లు మూసుకుని) ఓం! ఓం! ఓం! (అని మళ్లీ కళ్ళు తెరిచి) అయినా, నాకు రక్తపాతం గిట్టదు. పైగా, వనదేవత కరుణతో పాలిస్తున్నవాడిని. నా ప్రజల్ని రక్షించడమే నా కర్తవ్యం – (అని కళ్ళు మూసుకుని) వినండి ఈ అడవి కొసన మా తోటివాడు సంజీవకుడు చచ్చిపడి వున్నట్లు మా దివ్యనేత్రాలతో కనుక్కున్నాం –

(ఇంతలో పిల్ల నక్క పరిగెత్తుకుంటూ వచ్చింది)

**పిల్ల నక్క**

(సింహంతో) మహారాజా! మహారాజా!... (తండ్రి దగ్గరకు పోయి) నాన్నా! నాన్నా! అడవి చివర బాబాయి పడిపోయివున్నాడు. చచ్చిపోయినట్టున్నాడు. ఎవరూ చంపినట్టు లేదు – (ఏడుస్తూ) నాన్నా! బాబాయి –

**ముసలినక్క**

అయ్యో! అట్లాగా!..... సంజీవకుడేమిటి? చచ్చిపోవడమేమిటి? ఏమిటి చెయ్యడం?

**చపలజిత్తు**

ఈ ఖడ్గమృగం, ఈ గాడిదల సాయంతో, సంజీవకుణ్ణి యిక్కడకు తీసుకురండి – నా మహిమ చూపుతా – (ఆ జంతువులు వెడతాయి) చూడండి సింహం గారు! మీరు చాలా బలవంతులు. మనం అంతా అమ్మవారి ఆజ్ఞకు దాసోహం కావలసిందే! లేకపోతే ఏం చెయ్యాలో వనదేవతే చెప్పి పంపింది. పులిగారూ, మీరన్నా, ఈ సింహంగారన్నా నాకు చాలా గౌరవం. అమ్మవారి అనుజ్ఞ ప్రకారం నేను రాజునే కాని ఇది వరకులా పరిపాలనంతా మీరు చెప్పినట్టే చేద్దాం – మీరు రాజుగా వుండాలంటే ఆ చచ్చిపోయిన సంజీవకుణ్ణి బతికించండి.

**సింహం, పులిరాజు**

చంపడమే వచ్చు మాకు. బ్రతికించడం చేతకాదు.

**చపలజిత్తు**

(ఇంతలో సంజీవకుడిని తెస్తాయి జంతువులు) సరే! అయితే చేసుకోండి. మీరంతా దూరంగా జరగండి... అమ్మా! వనదేవతా? మా అడవిలో ఒక అమాయక ప్రాణి చనిపోయింది. నువ్వు నీ దూతగా నన్ను పంపావు! కరుణించు తల్లీ! ఈ ప్రాణిని కాపాడు! నేను దేవదూతను అని వీళ్ళకి ఎరుక చెప్పు.. చెప్పు తల్లీ... "ఓం వనదేవతాయనమః" (మూడుసార్లు) (అని సంజీవకుడి దగ్గరకు వెళ్ళి) సంజీవకా! లే! నేను? దేవదూతను చెబుతున్నాను. లే! లే! లే!

(సంజీవకుడు గబగబా లేచి.... చపలజిత్తు దగ్గరకు వచ్చి కాళ్ళమీద పడి వెనక్కు వెడుతుంది)

**జంతువులు**

చపలజిత్తు మహారాజుగారికి జై –

**పులిరాజు**

(సింహంతో) మహారాజా! అన్ని జంతువులు చపలజిత్తు వైపే వున్నాయి. మనం యిప్పుడు ఎదురు తిరిగితే ఏం జరుగుతుందో తెలియదు. మీరు కూడా ఒప్పేసుకోండి.

**సింహం**

(పులితో) సరే! చూద్దాం – (అందరితో) చపలజిత్తు మహారాజుగారూ! మీ గొప్పతనాన్ని మీరు చెప్పగా విన్నాం. ఇప్పుడు కళ్ళారా చూశాం... ఇహ మీరే ఈ అడవికి మహారాజు – వనదేవత ఎవరిని కరుణిస్తే – వారే కదా మహారాజు!

చపలజిత్తు మహారాజు గారికీ –

**జంతువులు**

జై.

**చపలజిత్తు**

సంతోషం! వనదేవతే మన కందరికీ పెద్ద. ఆవిడ మాటలే మనకు వేదం. ఇదివరకులా ఏకచ్ఛత్రాధిపత్యం లేకుండా ఈ రాజ్యాన్ని ప్రజాస్వామ్యదేశంగా నేను పరిపాలిస్తాను. అధికార వికేంద్రీకరణ నా పద్ధతి. దీని ప్రకరం – సింహంగారూ! మీకు రక్షణశాఖను ఇస్తున్నాను. మీరు మీ గర్జింపులతో ఈ అడవిని కాపాడండి. పులిరాజుగారూ, మీరు ఆంతరంగిక మంత్రిగా వుండి అందరి పాలనా చూడండి. రవాణాశాఖ ఏనుగులుగారికి. ఈ పావురంరాజుకి తపాలా శాఖ – మిగిలిన శాఖలన్నీ త్వరలోనే తగిన వాళ్ళకి కేటాయిస్తాను.

**జంతువులు**

చపలజిత్తు మహారాజుగారికీ – జై....

**పులిరాజు**

కృతజ్ఞులం మహారాజా! మేం అంతా మా పనులని జాగ్రత్తగా నిర్వహిస్తామని దేవరవారికి విన్నవిస్తున్నాను. ఈ సందర్భంగా మా జంతుమిత్రులంతా మీకో విన్నపం చేస్తున్నారు. వనదేవతే స్వయంగా మీకు ఈ ఘనతని యివ్వడం మా అదృష్టం. మేం అంతా మీకు పట్టాభిషేకం చెయ్యాలని నిశ్చయించుకున్నాం. (జంతువులన్నీ అవును, అవును – అంటాయి) రేపు వుదయాన రాజుగారికి మంగళస్నానాలతో పట్టాభిషేకోత్సవం చేయాలి. ఈ ఉత్సవంలో కోయిలలు గానం చేస్తాయి. నెమళ్లు నృత్యం చేస్తాయి. సింహంగారు, ఇతర్లు తమ తమ సుస్వరాలతో స్వాగతం పలుకుతారు. హంస బ్రహ్మగారు వేదమంత్రాలు చదువుతారు.

(అంతా ఆనందంతో కేరింతలు కొడతారు)

**చపలజిత్తు**

సంతోషం... సంతోషం..... ఇవ్వాళ్టికి సభ చాలిద్దాం... సెలవు –

(అంతా వెళ్ళిపోతారు. నక్కలు తప్ప)

**ముసలి నక్క**

ఏం చపలజిత్తూ! అందరికీ తలా పదవీ యిచ్చావు! మనలో ఎవరూ మంత్రిగా వుండడానికి పనికిరారా?

**చపలజిత్తు**

అదేమిటి మామా? ఈ రాజ్యంలో మంత్రులు కావడానికి నక్కల్ని మించిన వాళ్ళెవరు? అయినా మహారాజుని నేనే మీవాడినయినప్పుడు యింకా పదవులెందుకు? రేపటినుంచీ మీరంతా నాతోపాటే వుంటారుగా! – (సంజీవకుణ్ణి పిలిచి) సంజీవకా! నువ్వు నాతోనే వుండాలి! నా ఆంతరంగిక కార్యదర్శివి నువ్వే! పదండి –

C C C C C

# అయిదవ రంగం

(సన్నాయిమేళం….. అంతా కోలాహలంగా వుంది…. ఒక్కొక్కరూ ఒక పాట చరణం పాడుతూ మరో పక్కకి వెడతారు)

**నక్కలు**

మా చపలజిత్తు మహారాజు ఆయెగా॥
మా నక్కలన్నీ ఊళవేస్తూ పాడగా॥
ఆనందమానంద మాయెనే
మా చపలజిత్తు మహారాజు ఆయెనే!

**గాడిదలు**

చిన్న చిన్న ప్రాణులకు మహాయోగమబ్బెగా
సన్నకారు జంతువులే మహారాజులయిరిగా॥
ఆనందమానందమాయెనే!
మా చపలజిత్తు మహారాజు ఆయెనే!!

**నెమళ్లు**

బాహుబలం ధాష్టీకం పరిపాలన కాదని
బుద్ధిబలం కావాలని చాటి చెప్పినట్టి రాజు ॥
ఆనందమానంద మాయెనే!
మా చపలజిత్తు మహారాజు ఆయెనే!!

**కోయిలలు**

కొత్త ఏడు వచ్చిందని వసంతమ్మ చెప్పింది
కొత్తరాజు వచ్చాడని వనదేవత పలికింది
ఆనందమానంద మాయెనే!
మా చపలజిత్తు మహారాజు ఆయెనే!!
అందరూ కలిసి "ఆనందమానందమాయెనే" అని పాడతారు.

**పులిరాజు**

అందరూ ఇకతెమలండి… పట్టాభిషేకానికి సమయం అయింది…

**హంస**

పుణ్యావచన మొదలెపెట్టనా? శుక్లాంభరధరం విష్ణుం.... (అని చదివిన తరువాత)

ఓం సహస్రశీరుషం దేవం

విశ్వాత్వం విశ్వసంభవం –

మహారాజుగారిని నిద్రలేపి మంగళస్నానాలు చేయించండి.

**పులిరాజు**

అట్లాగే బ్రహ్మగారూ!.... తెమలండి తెమలండి... మహారాజా! నిద్రలేవాలి... పట్టాభిషేక ముహూర్తం దగ్గర పడ్డది... ఏనుగులు నీళ్ళు తెచ్చాయా? ఓ గజరాజా! రా!

**గజరాజు**

(ఘీంకరిస్తూ వుండగా) నాలగు కొలన్లనుంచి నీళ్ళు పట్టుకు వచ్చాం. మహారాజెక్కడ?

**చపలజిత్తు**

(తనలో) ఆహా! రాజభోగం అంటే యిదే కాబోలు! ఇదివరకు దగ్గరకు వెళ్ళడానికి భయం వేసే నాకు ఈ జంతువులన్నీ నీరాజనాలు పడుతున్నాయి.... ఇన్నాళ్ళ నా కోరిక యిప్పుడు సఫలం కాబోతున్నది! ఆహా! ఏమానందము!! ఏమానందము!!

**పులిరాజు**

నెమలికన్యా! మహారాజుగారికి బొట్టుపెట్టి అభ్యంగన స్నానం చేయించడానికి ఏర్పాట్లు చెయ్యి – (నెమలి అట్లా చేస్తుంది) మహారాజా ఇట్లారండి! ఇక్కడ నిలబడండి.... ఏనుగులూ! మీరు తెచ్చిన పుణ్యజలాలలో మహారాజుగారికి మంగళ స్నానాలు చేయించండి. (జంతువులన్నీ చపలజిత్తు కనిపించకుండా చుట్టూ నిలబడతాయి) (బాజాలు మోగుతూ వుండగా ఏనుగులు నీళ్ళు చల్లుతాయి)

**ముసలి నక్క**

(కిందకి వస్తున్న నీళ్లని చూస్తూ) ఏమిటా రంగు నీళ్ళు? నీలంగా లేవూ? ఏమిటిది? నీళ్ళు మీదపడితే ఆ రంగేమిటి అట్లా పోతున్నది? ఒరేయ్ చిన్నాడా! చూడరా ఆ రంగు!!

**పిల్ల నక్క**

అవును నాన్నా!

**ముసలి నక్క**

(పిల్ల నక్కతో) వీడికి నిజంగా మహత్తు వుందో లేదో తెలుసుకుందాం – వీడు రాజైనప్పటినుంచి ఊళవెయ్యడం లేదు. ఇప్పుడు ఊళవేస్తాడేమో చూద్దాం – (పైకి) మన చపలజిత్తు మహారాజు కావడం మనకెంతో ఆనందం. ఆ ఆనందంతో అందరూ ఊళవేస్తూ జయజయ ధ్వానాలు చెయ్యండి.

(అన్ని జంతువులు పెద్దగా ఊళవేస్తాయి. 'మహారాజుకి జై' అంటూ – ఆ ఆనందంతో ఊళవేస్తాయి..... వాటితో పాటు చపలజిత్తు కూడా ఊళవేస్తాడు. ఒళ్ళు దులుపుకుంటాడు. రంగుపోతుంది..... ఆ సంగతి గమనించక ఊళ వేస్తూనే వుంటాడు)

**ఖడ్గమృగం**

అదేమిటి! ఆ రంగు!! మహారాజుగారి మీది నీలంరంగు ఏది?

**గాడిద**

ఆ బంగారు మచ్చలేవి?

**కుందేలు**

అదేమిటి చపలజిత్తు మహారాజా! మీ ఒంటిమీద –

(అన్ని జంతువులు నిశ్చేష్టంగా నిలుస్తాయి)

**చపలజిత్తు**

అమ్మో! నీళ్ళు పోస్తే రంగు పోతుందని తెలియదే! ఇప్పుడెట్లా?..... (గంభీరంగా పైకి) స్నానం చేసేటప్పుడు అపవిత్రం కాకూడదని వనదేవత చెప్పింది – మళ్ళీ ఆరిపోగానే అవే వస్తాయి...

**హంస**

(మంత్రాలు చదువుతాడు)

**ముసలినక్క**

ఏది చపలజిత్తూ! రంగు మచ్చలు మళ్ళీ వస్తాయన్నావు. రాలేదేం?

**చపలజిత్తు**

చచ్చాం.... వీడు నా మీద కసితీర్చుకుంటున్నాడు. ఈ సంగతి సింహం, పులిరాజు కనిపెడితే – మెల్లగా ఇక్కడినుంచి ఉడాయిద్దాం –

(తప్పించుకుని మెల్లగా జారుకుంటూ వుండగా)

**పులిరాజు**

ఏయ్! చపలజిత్తూ! ఆగు... కాదు కాదు, ఆగండి చపలజిత్తు మహారాజుగారూ! మీ ఒంటి మీద తడి ఆరాలి... మళ్ళీ మీ రంగురావాలి.... వనదేవత వరంతో వచ్చిన ఆ మచ్చలు రావాలి....

**చపలజిత్తు**

అసలు జరిగిందేమిటంటే..... ఇప్పుడే వస్తా – వనదేవత ప్రార్థన చేసి – ఆవిడని ఆవాహన చేస్తాను.

**పులిరాజు**

మనమంతా కలిసి ఇక్కడే చేద్దాం ఆ ప్రార్థన ఏమిటో –

**చపలజిత్తు**

(ఒణికిపోతూ) అయ్యా!.....

**ముసలి నక్క**

చెప్పు.... నిజంగా నీకు వనదేవత ఈ రంగునీ మచ్చల్నీ యిచ్చిందా?

**చపలజిత్తు**

మామా!....

**ముసలి నక్క**

మావా ఏమిట్రా చవటా! నిజం చెప్పు –

**సింహం**

వాడు అట్లా ఎందుకు నిజం చెబుతాడు?

**చపలజిత్తు**

(ఒణికిపోతూ) క్షమించండి మహారాజా!..... అసలు ఏం జరిగిందంటే – వనదేవత –

**ముసలి నక్క**

ఆ సంజీవకుడిని అడిగితే నిజం తెలుస్తుందిగా! ఒరే తమ్ముడూ! ఇటురా!

**సింహం**

సంజీవకా! నిజం చెప్పు...... చెప్పకపోయావో –

**సంజీవకుడు**

మహారాజా! నిజమే చెబుతాను! ఈ చపలజిత్తు నన్ను చచ్చినట్లు పడి వుండమన్నాడు. అట్లా పడివుంటే బతికిస్తానన్నాడు.... అప్పుడు మీరంతా మా మాట వింటారటగా!

**సింహం**

అమ్మో! అధికారం కోసం ఎంత మోసం చేశావ్! నిన్ను బతకనివ్వకూడదు –

రా, రా! దుర్మార్గుడా!

రంగులేసుకుని ఎంత కాలం మోసం చేస్తావ్? రా – రా – (గర్జింపు)

(నక్క అమ్మో, అమ్మో అంటూ పరిగెడుతుంది. సింహం యితర జంతువులు వెంట పడతాయి.... అంతా దాన్ని వెంటాడుతూ వెళ్ళిపోతారు)

(అన్ని జంతువులూ తెరలోపలికి పోయి, తిరిగి తమ తమ వేషాలు తీసివేసి ముందుకువచ్చి మంగళం పాడతారు)

మంగళం మంగళం
మంచి వాళ్ళకందరికీ
మంగళం మంగళం
దొంగరంగు పులుముకొని
దోపిడి చేద్దామంటే
అమంగళం అమంగళం
పై పై రంగులు చూపి
అధికారం చెలాయిస్తే
అమంగళం అమంగళం
మంచివాళ్ళ కందరికీ
మంగళం మంగళం
ఈ నాటిక చూసినవాళ్ళకి
మంగళం మంగళం
మరి దీనిని వేసినవాళ్ళకి
మంగళం శుభమంగళం

C C C C C